ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 12

## సజ్జన వందిత



జ్ఞానిని జ్ఞానే గుర్తించగలడని రమణ మహర్షి వాక్యము. వజ్రము యొక్క విలువ సిసలైన వజ్రాల వర్తకునికే ఎరుక గాని పుచ్చు వంకాయలమ్ముకునే వారికెలా తెలుస్తుంది. శ్రీస్వామివారు చాలా బాగా ప్రశ్నలు చెపుతాడని లోకులు అనుకునే రోజులలో ఋషికేశ్ నుండి శ్రీ చిదానందస్వామిగారు, శ్రీ దేవానందస్వామిగారు వచ్చి శ్రీస్వామివారిని పరబ్రహ్మ స్వరూపులుగా గుర్తించి పాదాభివందన మాచరించారు. అలాగే ఆచార్య శ్రీ భరద్వాజగారు, శ్రీస్వామివారిని దర్శించినది మొదలు తన పరిచయస్థులందరినీ శ్రీస్వామివారిని అవశ్యం దర్శించమని, వారు భూమిపై ఆవిర్భవించిన దైవస్వరూపమని, వారిని కీర్తించేవారు. ఇదేవిధంగా చాలామంది అవధూతలు వచ్చి శ్రీస్వామివారిని దర్శించి వారి ఆశీస్సులు పొంది వెళ్ళారని శ్రీస్వామివారి సేవకులు చెపుతున్నారు. కానీ వాళ్ళు ఆ అవధూతల పేర్లు, అడ్రస్సు, శ్రీస్వామివారితో వారి సంభాషణలు గ్రంథస్థము చేయలేదు.

గోపారం కాపురస్థుడు పాలకొండ సుబ్బారెడ్డిగారు ఇలా చెపుతున్నాడు.

ఆ రోజుల్లో శ్రీస్వామివారి దగ్గరకు జనం ఇంత ఎక్కువగా వచ్చేవారు కాదు. వారి మంటలు, గోనె సంచులు, తాటాకులు చూచి ఆయనొక పిచ్చి వాడనుకొనేవారు. అనుభవముగల కొద్దిమంది మాత్రమే శ్రీస్వామివారిని దర్శించే రోజులవి.

ఋషికేశ్ నుండి శ్రీ యుతులు చిదానందస్వామి, దేవానందస్వామి మాధవానందస్వామివార్లు ఒకరోజున శ్రీ వెంకయ్యస్వామివారి దర్శనార్థం వస్తున్నారని తెలిసి, వారిని చూడాలని జనం తండోపతండాలుగా వచ్చియున్నారు. సాయంత్రం గం॥ 4.30 అయినా ఆ యతివరులు రాలేదని జనమంతా నిరుత్సాహపడుతున్నారు. అది చూచి శ్రీ వెంకయ్యస్వామివారు

'వస్తున్నారయ్యా! ఇంకా గంటలు కాలేదు' అన్నారు. శ్రీస్వామివారు చెప్పినట్లు కొద్ది నిమిషాలలో శ్రీచిదానందస్వామి, తదితరులు కారులో వచ్చారు. వచ్చిన వెంటనే నారాయణ నామస్మరణతో శ్రీస్వామివారి పాదాలమీద పడ్డారు. ఇది చూచిన జనమంతా భగవన్నామ స్మరణతో ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనింప చేశారు. 'వచ్చిన స్వాముల కంటేగూడా మన స్వామే గొప్పవాడన్నమాట!' అని అనుకున్నారు. ఏదో తీపి పదార్థము తెచ్చి శ్రీస్వామివారిని తినమని ఆ స్వాములు ముగ్గురూ ప్రాధేయపడ్డారు. 'అయ్యా! దాన్ని తినడం విషం తిన్నట్లే గదా! ఇంతమంది ఇక్కడున్నారు. వీరందరికీ పెడితే నాకు పెట్టినట్లే!' అన్నారు శ్రీస్వామివారు. ఆ మాట వింటూనే శ్రీ చిదానందస్వామి చెంపలేసుకున్నారు.

అప్పుడు వారిని శ్రీస్వామివారు ఆశీర్వదించి 'త్వరలో సముద్రం దాటిపోతావు' అని చెప్పారు. అదే విధంగా శ్రీచిదానందగారు తమ ఆశ్రమం చేరేసరికి అమెరికా నుండి వారి కొరకు ఆహ్వాన మెదురు చూస్తున్నది!

నంద్యాల ప్రాంతం నుండి వచ్చిన ఒక భక్తుడు మరియు వారితో వచ్చిన సుబ్బన్న అనే ఒక సాధువు శ్రీస్వామివారిని తలుపూరు నారాయణదాసు ఆశ్రమంలో దర్శించారు. ఈ సాధువు చాలా సిద్ధులు గలవారు. ఉదా:- అన్నానికి కూర్చుంటే పది మంది అన్నం పెట్టినా సరే, ఇరవై మంది అన్నం పెట్టినా సరే చాలు అని అనడు. పెడుతూ వుంటే తింటూనే వుంటాడు. 'మిగిలిన భక్తులకు తేవాలగదా, ఇక చాల్లే సుబ్బన్నా!' అంటే 'ఆ! చాల్లే' అంటూ విస్తర దగ్గర నుండి లేస్తారు. మనం పిలిచి అన్నం పెడితే తింటారు. లేకుంటే ఎన్నాళ్ళయినా అన్నం పెట్టమని అడిగేవారుకాదు. దేవాలయాలు, గ్రామ చావడి, పాడుపడ్డ ఇండ్లే వీరి నివాసాలు, ఒక్క క్షణం ఏమారకుండా నడుస్తూంటారు. నడిచే తీరు విచిత్రంగా వుంటుంది. ఎడమకాలు బొటనవ్రేలికి, కుడికాలు మడిమ తగిలేటట్లు అడుగు వేస్తూ, ముందుకు సాగుతూ, గొణుగుకుంటూ, అడుగు లెక్కవేస్తూ నిర్విరామంగా నడిచిన చోటే అటు ఇటు నడుస్తూంటారు.

వీరు శ్రీస్వామివారిని గూర్చి శ్రీస్వామి భక్తులతో అన్న మాటలు గమనించదగినవి.

'స్వామిలాగేవున్నాడు, చాలా జాగ్రత్తగా వుండండి' అని సెలవిచ్చారు.

శ్రీస్వామివారినడిగి మీరేమైనా వ్రాయించుకోండని శ్రీస్వామివారి సేవకులంటే 'వచ్చేటప్పుడే దోవన ఎదురై ఇద్దరం మాట్లాడుకున్నాము. ఇంకేమి అడగబళ్ళేదులే' అని సెలవిచ్చారు.

శ్రీస్వామివారు సోమశిల దగ్గర వేంచేసి యున్నప్పుడొక దిగంబర యోగి శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చారు. శ్రీస్వామివారు 'అయ్యా! ఆయనకు కొంచెం గోచి పెట్టండయ్యా' అని సెలవిచ్చారు. ఆ దిగంబరయోగి 'పిల్లవాడు పెద్దవాడేగాని ఎగదీసుకోవడం పోలేదే' అని విన్నవించారు.

ఈ సంభాషణ యొక్క నిజమైన అర్థం వారిద్దరికే తెలుసు. ఈ విధంగా అనేక మంది సాధకులు, యోగులు, సాధువులు శ్రీస్వామివారి దర్శన, ఆశీస్సుల కొరకు వచ్చి వారి వారి పనులు చక్కబెట్టుకొని వెళ్ళేవారు.

శ్రీస్వామివారి మహత్తర సంకల్పం వలన ఇట్టి సంఘటనలు గానీ, సంభాషణలుగానీ గ్రంథస్థం చేయబడకపోవడం మన దురదృష్టం. నేటికీ వీరు ఆధ్యాత్మిక భిక్ష కోరినవారికి పరివర్తన తెచ్చి అవసరమైనప్పుడు పి.మాధవరావుగారు, నందగిరి సుందరరావుగారిలాంటి వారికి భౌతిక దర్శనం గూడా ప్రసాదించి ఆత్మపథంలో చేయూత నిచ్చి నడిపించుచున్నారు.

ఒకప్పుడు ఇద్దరు పేరుమోసిన మంత్రగాళ్ళు శ్రీస్వామివారి వద్దకొచ్చారు. గొలగమూడి ఆశ్రమంలోని గంగరావి చెట్టు క్రింద కూర్చున్నారు. ఉదయం కూర్చుని మధ్యాహ్నం 4 గం॥ వరకు అచ్చట నుండి కదలలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఆనాడు శ్రీస్వామివారు అధికంగా మంట వేస్తూ వున్నారు. 4 గం॥ల ప్రాంతంలో వారికి శ్రీస్వామివారు అన్నం పెట్టించారు. 'వీళ్ళు చాలా అలసిపోయారు, చెరి రెండు రూపాయలివ్వండి' అన్నారు. భక్తులలాగే ఇచ్చారు.

వారు వెళ్ళేటప్పుడు కొందరు భక్తులతో అన్నారు: 'శ్రీస్వామివారి గొప్పతనం విని, అసూయచెంది, వారిపై మంత్ర ప్రయోగం చేసేందుకు వచ్చాము. అదేమి చిత్రమోగానీ వచ్చింది మొదలు ఆ మాటే మరచిపోయి ఈ చెట్టు క్రింద ఇలా కూర్చుండి పోయాము. అది శ్రీస్వామివారి మహిమ. మేమింత దుర్బుద్ధితో వచ్చినాగానీ శ్రీస్వామివారు మమ్ము ఇంత ఆదరంగా చూచారు. శ్రీస్వామివారి కృపకు మేము అర్హులముకామ'ని చెప్పి శ్రీస్వామివారికి మనఃపూర్వకంగా నమస్కరించారు.